క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



పోలీసులకు సాయిబాబా చిత్రపటం అందజేస్తున్న వెంకటరెడ్డి

కూకట్‌పల్లి: కూల్ ఎవరెస్ట్ ఐస్‌క్రీం కంపెనీ అధినేత యక్కంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మమత హాస్పిటల్, మన అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కూకట్‌పల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూకట్‌పల్లి జిల్లా సమ్మేళనం పోస్టర్‌ను వివిధ కళాశాలల విద్యార్థులు కేపీహెచ్‌బీ నగర కార్యదర్శి రోషన్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ.. ఈ నెల 6న జరగబోయే జిల్లా సమ్మేళన సభలకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యారంగ స్థితిగతుల గురించి చర్చించి తీర్మానాలు ప్రవేశపెడతామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్, నగర సంయుక్త కార్యదర్శి సుధీర్, సంధ్య, స్వాతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

భాగ్యనగర్‌కాలనీ: సమాజ అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శేరిలింగంపల్లి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (స్పావా) శనివారం ప్రకటించింది. రాష్ట్రంలోని క్రిస్టియన్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అర్హులకు అవగాహన కల్పిస్తామని స్పావా ప్రతినిధులు ప్రకటించారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ, సోషల్ జస్టిస్, సోషల్ ఆఫ లిఫ్ట్ వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. సంఘ సేవకుడు, సువార్తికుడు రెవరండ్ ఎడ్వర్డ్ రోజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరంలో చేపట్టనున్న కార్యక్రమాల కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ విప్పర్తి, మధు కంకణాల, డాక్టర్ ప్రసాద్, పాస్టర్ ఆర్‌పీ దాస్, రూఫస్, వందన్‌కుమార్, జార్జ్, ప్రశాంత్ ప్రిన్స్‌తో పాటు పెద్ద సంఖ్యలో పాస్టర్లు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో వేగంగా జరుగుతున్న పనులు
- పనులపై నిత్యం సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే
- అధికారుల నిరంతర పర్యవేక్షణలో నిర్మాణ పనులు



మానస సరోవర్ వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో డిసెంబర్ 2న మంత్రి కేటీఆర్ ప్రారంభించిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. నిత్యం కాంట్రాక్టర్లతో సమీక్షించి పనులు వేగంగా జరిగేందుకు కృషి చేస్తున్నారు. ఈ పనులు పూర్తి చేస్తే డివిజన్‌కు మరో రూ.40 కోట్ల వరకు నిధులు విడుదల చేసేందుకు మంత్రి సుముఖత వ్యక్తం చేయడంతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట బోయిన్ చెరువు రిటర్నింగ్ వాల్, మానస సరోవర్ టీ జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణం, అలీ కాంప్లెక్స్ నుంచి ఆర్‌ఆర్‌నగర్ ప్రాగా టూల్స్ వరకు వరద నీటి బాక్స్ డ్రైనేజీ నిర్మాణం వంటి రూ.10 కోట్లతో చేసే పనులను ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

పనులపై ఎమ్మెల్యే సమీక్ష..

డివిజన్‌లో ప్రతిష్టాత్మకంగా చెపట్టిన అభివృద్ధి పనులన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షిస్తున్నారు. పనుల తీరుతెన్నులను తెలుసుకొని త్వరితగతిన పూర్తి చెయ్యాలని అధికారులకు సూచిస్తున్నారు. చెరువు రిటర్నింగ్ వాల్ పూర్తయితే సుందరీకరణ పనులకు కేటీఆర్‌తో చర్చించి నిధులు తెచ్చేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తానన్నారు.

స్థానికుల్లో హర్షం..

ఎన్నో ఏళ్లుగా ముంపు సమస్యతో ఇబ్బందులు పడుతున్న మానస సరోవర్ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణంతో సమస్య పరిష్కారం కాబోతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాక్స్ డ్రైనేజీ నిర్మాణంతో వరద ముంపు సమస్య ఉండదని శ్రీసాయి ఎన్‌క్లేవ్, ఆర్‌ఆర్‌నగర్, అలీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు రిటర్నింగ్ వాల్‌తో అంజయ్యనగర్, హస్మత్‌పేట ప్రజల సమస్యలు పరిష్కారం కానున్నాయి.



ఎమ్మెల్యే కృషితో అభివృద్ధి

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతున్నాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారం ఉండడంతో నిధులకు ఎలాంటి కొరత లేదు. డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఎమ్మెల్యే కృషి ఫలితంగా డివిజన్‌లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఈ పనులు పూర్తి అయిన వెంటనే చెరువు సుందరీకరణకు నిధులు ఇచ్చేందుకు ఎమ్మెల్యే సానుకూలంగా ఉన్నారు. – ముద్దం నర్సింహయాదవ్, కార్పొరేటర్



రెండు నెలల్లో పూర్తి చేస్తాం

డివిజన్‌లో మంత్రి కేటీఆర్ ప్రారంభించిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నాం. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. సంబంధిత కాంట్రాక్టర్లతో నిత్యం చర్చించి పనులు వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. – ఏఈ అరవింద్



హస్మత్‌పేట బోయిన్ చెరువు రిటర్నింగ్ వాల్ పనులు



అలీ కాంప్లెక్స్ వద్ద సంగం వరకు పూర్తి చేసిన బాక్స్ డ్రైన్ పనులు

కూకట్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో రూ.3.05 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ సబిహాబేగంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ప్రారంభిస్తున్నామని, ఇవి పూర్తయితే నియోజకవర్గంలో దాదాపు 98 శాతం పనులు పూర్తి చేసినట్లవుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో దశాబ్దాలుగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలను పరిష్కరించునన్నట్లు తెలిపారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే అని ముఖ్యమంత్రి కేసీఆర్ నిరూపించారన్నారు. ప్రజలకు సేవ చేయాలనే భావన మనసులో ఉంటే దైవం మనల్ని ముందుకు నడిపిస్తుందన్నారు. దశాబ్దాలుగా పూర్తి కాని బాలానగర్ ఫ్లై ఓవర్, దిల్‌కుషనగర్ రోడ్లు, అల్లాపూర్ డివిజన్‌లో కళకళలాడుతున్న అభివృద్ధి దీనికి నిదర్శనం అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందని, కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, జనరల్ సెక్రటరీ పిల్లి తిరుపతి, మహిళా మండలి అధ్యక్షురాలు పార్వతమ్మ, జ్ఞానేశ్వర్, రవీందర్‌రెడ్డి, యోగిరాజు, ఎస్.శివ, అమిత్, సలీం, రఫీక్, అక్బర్, మహమ్మద్, ఇసాక్‌బాబా, విక్రమ్, రియాజ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ పాలక కమిటీ కాల పరిమితి ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో యూనియన్ ఎన్నికలు నిర్వహించినట్లయితే కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. కాల పరిమితి ముగిసి నెల రోజులు అవుతున్నా ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించటకపోవడంతో పాటు కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని, ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం ప్రారంభం



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ ఫేజ్–13లో ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గార్డెనియాలో శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను ఆ బ్యాంక్ హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ మన్మోహన్‌గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం, ఇతర వ్యాపార సంబంధిత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ తెలంగాణ సౌత్ రీజియన్ హెడ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టీవీవీఎస్ శర్మ, మాదాపూర్ బ్రాంచ్ హెడ్ మంజూషా, సీనియర్ మేనేజర్ జి.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడతాం



సాయినగర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తున్న యోగానంద్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని విజయానగర్, సాయినగర్‌లో గజ్జల యోగానంద్ బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా రెండు గంటలే ఉంటుందని, లో ప్రెషర్ సమస్య ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారులకు, కార్పొరేటర్‌కు అనేకసార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. డ్రైనేజీ నీరు రోడ్ల మీదకు చేరుతుండడంతో దుర్వాసన వస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ కార్మికులు శుభ్రం చేసినా డ్రైనేజీల్లో ఉన్న చెత్తను అక్కడే వదిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల కొరత ఉందని, విద్యుత్ వైర్లు సరైన పద్ధతిలో లేకపోవడంతో నేలపైకి ఒరుగుతున్నాయన్నారు. ‘మీ సమస్య మా పోరాటం’ కార్యక్రమం ద్వారా త్వరలో పరిష్కరిస్తామని యోగానంద్ స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజిత్ వర్మ, సురభి రవీందర్, స్రవంతి, రఘు, రామకృష్ణ, రత్నకుమార్, లడ్డూ, సిద్ధు, ఈశ్వర్, నర్సింహారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మబండలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్ ఫేజ్ 2లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండడంతో బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, నూతన పైపులైన్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ లైన్ పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలన్నారు. కాలనీలో కొన్ని చోట్ల విద్యుత్ దీపాలు లేవని ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఏఈ శ్రావణి, మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, సూపర్‌వైజర్ రవీందర్‌రెడ్డి, శివ, మల్లేష్ పాల్గొన్నారు.

‘అమోర్’ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కూకట్‌పల్లి: నగరంలో మల్టీ స్పెషాలిటీ, కేన్సర్ చికిత్స సదుపాయాలతో 250 పడకలతో కూడిన అమోర్ ఆస్పత్రిని శనివారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీష్ రావు ప్రారంభించారు. దేశంలోని ఉత్తమ ఆర్థో అంకాలజీ సర్జన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన డాక్టర్ కిషోర్ బి.రెడ్డి నేతృత్వంలో ప్రపంచ స్థాయి మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలను అమోర్ ఆస్పత్రి అందించనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలోని అమోర్ ఆస్పత్రిలో అత్యంత అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు 24 గంటలూ అందుబాటులో ఉంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. 30కి పైగా సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో అంతర్జాతీయ స్థాయి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిశోర్ బి.రెడ్డి మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందజేయనున్నట్లు తెలిపారు. రాడికల్ లాంజ్‌తో కూడిన అధునాతన క్యాథ్ ల్యాబ్, 1.5 టెస్లా ఎంఆర్ఐ సదుపాయం, అనేక ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతిక నిపుణులతో సంపూర్ణ చికిత్స అందిస్తామన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష తదితరులు హాజరయ్యారు.

పనులను త్వరగా పూర్తి చేయండి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు తదితరులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను, బాలాజీనగర్ ఎంఐజీ పార్కులో జరుగుతున్న పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సకాలంలో నిధులు మంజూరు చేస్తూ డివిజన్ అభివృద్ధికి దోహదపడుతున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, ప్రగతినగర్ కాలనీ అధ్యక్షుడు భూమండ్ల అశోక్, వినోద్‌కుమార్, సుభాష్‌గౌడ్, భాస్కర్‌రావు, సుశీల్, శ్రీశైలం, శారద తదితరులు పాల్గొన్నారు.